క్లుప్తంగా

బాధితులకు వరం సీఎంఆర్ఎఫ్



బాన్సువాడ రూరల్: ఆపదలో మెరుగైన వైద్యం చేయించుకోలేని బాధితులకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని, ఇది బాధితులకు వరంలాంటిదని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల 108 మంది బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే తన నివాసంలో శనివారం అందజేశారు. నియోజకవర్గంలోని 108మంది బాధితులకు మంజూరైన రూ.34లక్షల47వేల 500 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, నాయకులు మోహన్‌నాయక్, పిట్ల శ్రీధర్, అంజిరెడ్డి, నార్ల సురేశ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కామారెడ్డి టౌన్: కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చిత్రపటాలకు చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, కౌన్సిలర్లు శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షబ్బీర్ అలీ సీఎంతో మాట్లాడి కామారెడ్డి అభివృద్ధికి రూ. 27కోట్లు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉర్దొండ వనిత, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు చంద్రశేకర్‌రెడ్డి, అన్వర్ హైమద్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు



దోమకొండ: మండల కేంద్రంలోని రైతు వేదిక సమీపంలో ఎక్సైజ్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు శనివారం పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దార్ సంజయ్‌రావుతో కలిసి ఆయన స్థల పరిశీలన చేశారు. పన్నెండున్నర గుంటల స్థలానికి సంబంధించి తహసీల్దార్ ఆయనకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. త్వరలోనే భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని అన్నారు. ఆర్ఐ మహేందర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలి



కామారెడ్డి టౌన్: బీడీ కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.4016 జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే బీడీ కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీడీ పరిశ్రమలో పని చేస్తున్న బీడీ కార్మికులు, ప్యాకర్లు, బట్టీవాలా, చాటన్, టేకేదార్లకు 2014 ఫిబ్రవరి 28 తేదీ కటాఫ్‌ను తొలగించాలన్నారు. ధర్నాకు జిల్లాలోని బీడీకార్మికులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎల్లయ్య, అనసూయ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ బహుమతి



లింగంపేట: జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలో లింగంపేట బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించినట్లు మండల విద్యాధికారి శౌకత్‌అలీ తెలిపారు. పాఠశాలకు చెందిన సాత్విక్, ప్రతీక్‌గౌడ్ 8వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో జిల్లా టాపర్స్‌గా నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. సదరు విద్యార్థులకు పాఠశాలకు చెందిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు గైడ్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

‘మత్తడి వాగు’ కలుషితం

- వాగులోకి రైస్‌మిల్లుల వ్యర్థాలు
- నీటిని తాగి రోగాల బారిన పడుతున్న పశువులు
- పట్టించుకోని అధికారులు



రైస్‌మిల్లుల నుంచి కాలువ ద్వారా వాగులోకి ప్రవహిస్తున్న కలుషిత నీరు



మత్తడి వద్ద కలుషితమైన నీరు

సదాశివనగర్: మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన రైస్‌మిల్లులు ప్రజలపాలిట శాపంగా మారాయి. నిబంధనలకు విరుద్ధంగా మిల్లుల పరిసరాలను ఉంచడంతో చుట్టూ కలుషితమవుతున్నాయి. బాయిల్డ్ మిల్లు నుంచి వెలువడుతున్న వ్యర్థ పదార్థాలను నేరుగా ఒక కాలువ ద్వారా వాగులోకి వదులుతున్నారు. దీంతో మిల్లుల నుంచి వెలువడుతున్న కలుషిత నీరు ఆ ప్రాంతంలోని పంట భూములకు సైతం పారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లులు ప్రారంభం కాక ముందు ఇంతలా వ్యర్థపు నీరు వదలలేదని, గత ఏడాది నుంచి భారీగా వ్యర్థపు నీటిని వదులుతున్నారని ఆ ప్రాంత రైతులు పేర్కొంటున్నారు. మిల్లుల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను అరికట్టాలని గతంలో ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. మిల్లులు ఏర్పాటు కాకముందు వాగులోని నీరు తాగి దాహం తీర్చుకునేవారిమని ఇప్పుడు మిల్లుల ఏర్పాటు నుంచి ఆ కలుషిత నీటిని తాగలేక దాహార్తి తీర్చుకోలేని దుస్థితి నెలకొందన్నారు.

ప్రమాదకరంగా నీరు..

మిల్లుల నుంచి భారీగా వెలువడుతున్న కలుషిత నీటిని తాగిన పశువులు రోగాల బారిన పడుతున్నాయని పశువుల కాపరులు పేర్కొంటున్నారు. గతంలో అటవీ ప్రాంతంలో కేవలం మత్తడి వద్ద పుష్కలమైన నీరు లభించేదని, ఇప్పుడు నీటిని చేతితో తాకుదామంటే ప్రమాదకరంగా ఉందన్నారు. ఇకనైనా కాలుష్య నియంత్రణ అధికారులు దృష్టి సారించి మిల్లుల నుంచి వెలువడుతున్న వ్యర్థాపు నీటిని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పొద్దుగల్లనే వదుల్తరు



రైస్ మిల్లుల నుంచి ప్రతి రోజు పొద్దుగల్లనే వ్యర్థపు నీటిని మస్తుగా వదిలేస్తరు. ఆ నీరు ప్రవహిస్తున్నప్పుడు వస్తున్న వాసన భరించలేని విధంగా ఉంటుంది. ఒక్కోసారి పొలంలోకి కూడా కంపు నీళ్లు వస్తున్నాయి. సమస్య గురించి మస్తుసార్లు అధికారులకు, లీడర్లకు చెప్పినం పట్టించుకోలే.

– బెస్త భూమయ్య, రైతు, సదాశివనగర్

ముక్కు మూసుకొని దాటాలి



కాలువ పక్కనే భూములు ఉండడంతో చాలా మంది రైతులు భూముల కాడికి వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. ముక్కు మూసుకొని కాలువ దాటాల్సి వస్తోంది. అధికారులు దృష్టిసారించి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి. రైతుల సమస్యలు పరిష్కరించాలి.

– ఎన్ ప్రశాంత్, రైతు, సదాశివనగర్

నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కోనాపూర్‌లో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్, కోనాపూర్ గ్రామాల మధ్య రూ.12కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట నాయకులు జెట్టి హన్మాండ్లు, దిల్‌రాజుగౌడ్, కమలాకర్, మొగులాకర్, బంజ భూషణం తదితరులు ఉన్నారు.

హెచ్ఐవీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



దోమకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



సదాశివనగర్‌లో..

దోమకొండ: ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని హెచ్ఐవీ రహిత సమాజాన్ని నిర్మించాలని దోమకొండ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు గ్రామస్తుల సహకారంతో దోమకొండలో శనివారం వైఆర్‌జీకేర్ లింక్ వర్కర్ స్కీం సభ్యులు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీటీసీ, ఏఆర్టీ సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో మ్యాక నాగరాజు, యాదగిరి, తీగల తిర్మల్ గౌడ్, నల్లపు శ్రీనివాస్, శరత్ కుమార్, బాలకిషన్, శ్రీకాంత్, రాజు, రమేష్, రామకృష్ణ, అనంతరెడ్డి, గోపాల్ రెడ్డి, అబ్రబోయిన స్వామి, మధుసూదన్, లింగం, రాములు, అంజయ్య, రాజు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

సదాశివనగర్: హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని లింక్ వర్కర్ స్కీమ్ ప్రతినిధి అన్నపూర్ణ సూచించారు. శనివారం పాఠశాల విద్యార్థులచే మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం దామోదర్‌రెడ్డి, పీడీ హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐపై మంత్రికి ఫిర్యాదు



మద్నూర్: బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణపై వైన్స్ దుకాణదారులు, యజమానులు ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. మద్నూర్‌లో శనివారం నిర్వహించిన మంత్రి కార్యక్రమంలో బిచ్కుంద ఎక్సైజ్ పరిధిలోని వైన్స్‌షాప్ లైసెన్స్‌దారులు మంత్రిని కలిసి ఎక్సైజ్ సీఐ అరాచకాలపై, బెదిరింపులపై వివరించారు. బిచ్కుంద ఎక్సైజ్ పరిధిలో నిత్యం వైన్స్ దుకాణదారులతో దురుసుగా ప్రవర్తించి అక్రమ కేసులు పెడుతున్నాడని వారు మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటు మంత్రి, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుకు విన్నవించారు. స్పందించిన మంత్రి, ఎమ్మెల్యేలు వెంటనే విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. వైన్స్‌షాప్ యజమానులు, నిర్వాహకులు ఉన్నారు.

గిరిజన గురుకుల బాటను అడ్డుకున్న పోలీసులు



నస్రుల్లాబాద్: మండలం కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలకు బీఆర్ఎస్ నాయకులు సందర్శనకు వెళ్లగా పోలీసులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాన్సువాడ మున్సిపాల్ వైస్ చైర్మన్ జుబేర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ప్రతి పాఠశాలను సందర్శించడానికి వెళ్తే పాఠశాల సిబ్బంది, పోలీసులు అడ్డుకోవడం ప్రభుత్వ వైఫల్యం కనబడుతోందని అన్నారు. దీనిలో భాగంగా పాఠశాల ఎదుట నిరసన తెలుపగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకని పీఎస్‌కు తరలించారు. నాయకుల నర్సింలు గౌడ్, గణేశ్, రమేశ్, సాయిరాం, అఫ్రోజ్, డి సాయిలు, శంకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సదాశివనగర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, తోటి ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో మోడల్ స్కూల్ ప్రారంభమైన నాటి నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు 13 ఏళ్ల పాటు విద్యార్థులు పాఠాలు బోధించారని అన్నారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భానుమతి, రాజశేఖర్, రాజేందర్, లింగమయ్య, విద్యారమణ, వాసవి, జీజీయాబాయి, కృష్ణప్రియ, అనితా శర్మ తదితరులు పాల్గొన్నారు.

బోర్ మోటార్ల విద్యుత్ తీగల చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు మూడు వ్యవసాయ బావుల వద్ద బోర్ మోటార్లకు సంబంధించిన విద్యుత్ తీగలను శనివారం చోరీ చేశారు. అలాగే ఓ ఇంటి నిర్మాణానికి సంబంధించిన బోరుకు ఉన్న విద్యుత్ వైరును అపహరించారు. కొన్ని రోజులుగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామల్లో మోటార్ల వైర్లు చోరీలకు గురైతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

దోమకొండ: మండలంలోని లింగుపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామదేవతల ఆలయ నిర్మాణానికి దోమకొండకు చెందిన సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య శనివారం రూ.25వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సాయిలు, పెద్ద సాయిలు, అంజయ్య, మహేశ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు శనివారం విరాళాలు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఉలిసె విజయ్ కుమార్, పూజిత దంపతులు రూ. 10వేలు, నిజామాబాద్‌కు చెందిన గొల్లపల్లి ప్రవీణ్ కుమార్, స్నేహ దంపతులు రూ. 5వేల విరాళాలను అర్చకులకు అందజేశారు. అర్చకులు నరసింహాచార్యులు, పరందామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

శివాలయానికి మైక్‌సెట్..

తాడ్వాయి: మండల కేంద్రంలోని మల్లికార్జున ఆలయానికి తాడ్వాయికి చెందిన ఉపాధ్యాయుడు రాజాగౌడ్ మైక్‌సెట్‌ను శనివారం విరాళంగా ఇచ్చారు. భక్తుల సౌకర్యార్థం కోసం మైక్‌సెట్‌ను పూజారి జంగంచంద్రునికి అందించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అధికారులకు సూచించారు. పట్టణంలోని కేజీబీవీని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యాభ్యాసం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో కొనసాగుతున్న గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

అయ్యప్ప ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

ఎల్లారెడ్డి: పట్టణంలోని అయ్యప్ప ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శనివారం ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, గురుస్వాములు తదితరులు ఉన్నారు.

మంత్రికి స్వాగతం పలికిన నాయకులు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డికి విచ్చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు టీఎన్‌జీవో సంఘం నాయకులు శనివారం స్వాగతం పలికారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వచ్చిన మంత్రితో పాటు, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఎంపీ సురేశ్ షెట్కార్‌కు వారు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో సంఘం నాయకులు మహిపాల్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో స్వయం పరిపాలన దినోత్సవం



తాడ్వాయి: మండలంలోని బ్రాహ్మణపల్లి ఉన్నతపాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేపట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రవతి, పీడీ నగేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ యాప్‌పై అవగాహన



బీబీపేటలో మాట్లాడుతున్న అధికారులు

రాజంపేట/ బీబీపేట: రాజంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురాం ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక, యాప్‌ల గురించి శనివారం అవగాహన కల్పించారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన ద్వారా వచ్చిన దరఖాస్తుల లబ్ధిదారుల ఆధార్ నంబర్, ఆదాయం వంటి వివరాలను సంబంధిత ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అపర్ణ, తహసీల్దార్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు. బీబీపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులకు అధికారులు ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, ఎంపీవో అబ్బాగౌడ్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో ‘వేకప్ వింటర్ రన్’



భిక్కనూరు: మండల కేంద్రంలో సీఐ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం వేకప్ వింటర్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రన్ కార్యక్రమంలో సీఐ సంపత్‌కుమార్‌తో పాటు భిక్కనూరు రాజంపేట, దోమకొండ, బీబీపేట ఎస్సైలు సాయికుమార్, ఆంజనేయులు, పుష్పరాజులతో పాటు పోలీసులు, సౌత్‌క్యాంపస్ విద్యార్థులు పాల్గొన్నారు. లింగుపల్లి నుంచి బీటీఎస్ మీదుగా భిక్కనూరు వరకు పరుగును నిర్వహించారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



మాచారెడ్డి: వెలమ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని వెలమ సంఘం అధ్యక్షుడు హన్మంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఘన్‌పూర్, ఎలుపుగొండ, ఎల్లంపేట గ్రామాల వెలమ సంఘం ప్రతినిధులతో కలిసి మాచారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వెలమ సంఘం ప్రతినిధులు శ్రీధర్‌రావు, సత్యనారాయణరావు, తిరుపతిరావు, రాంచందర్‌రావు, మధుసూదన్‌రావు, నర్సింగరావు ఉన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి





గర్గుల్‌లో పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో జగన్నాథన్, తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో..

- డీవైఎస్‌వో జగన్నాథన్
- గ్రామాల్లో ప్రారంభమైన సీఎం కప్–2024 క్రీడా పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

కామారెడ్డి రూరల్/ తాడ్వాయి/ బీబీపేట: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని డీవైఎస్‌వో జగన్నాథన్ అన్నారు. కామారెడ్డి జిల్లాలోని అన్ని గ్రామాల్లో సీఎం కప్–2024 గ్రామస్థాయి పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. కామారెడ్డి మండలం గర్గుల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ పోటీలను జిల్లా డీవైఎస్‌వో జగన్నాథన్ ప్రారంభించారు. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని అన్నారు. మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్లయ్య, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నోముల మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్‌లో సీఎం కప్‌లో భాగంగా వాలీబాల్ ఆటల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ మోహన్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి ప్రవీణ్, మాజీఎంపీటీసీ జలందర్‌రెడ్డి, రాజలింగం, మేకల రాజు, పండరిగౌడ్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు. బీబీపేట మండల కేంద్రంలో సీఎం కప్ పోటీలను ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుతారి రమేశ్, మార్కెట్ కమిటీ చైర్మెన్ పాత రాజు, భూమాగౌడ్, మహేశ్, స్వామి, కార్యదర్శి రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మంత్రి రాకతో ముందస్తు అరెస్ట్

మద్నూర్: మండల కేంద్రంలో శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు రాకతో పోలీసులు మండలంలోని బీజేపీ, అసమ్మతి కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంత్రి పర్యటన, బహిరంగ సభలు ఉన్న నేపథ్యంలో బీజేపీ నాయకులు, అసమ్మతి కాంగ్రెస్ నాయకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో సంగమేశ్వర్, తుకారం, అరుణ్‌పటేల్ ఉన్నారు.

కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించండి

బీబీపేట: పంచాయతీ కార్యదర్శులపై పని భారాన్ని తగ్గించాలని కోరుతూ మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సర్వే కోసం కార్యదర్శులు నిర్వహించాల్సిందిగా కోరడంతో మరింత భారం పడుతుందని పేర్కొన్నారు. దీనికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో అబ్బాగౌడ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై స్పందించాలి

రామారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలపై స్పందించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కోల బాలరాజ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో దివ్యాంగులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగులకు సదరం సర్టిఫికెట్‌లు రావడం లేదని, వచ్చిన వారికి పింఛన్ మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు పెన్షన్ పెంపు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయిలు, కిష్టయ్య, సుజాత, రాజానర్స్, నరేందర్, శివరాజు, సత్తవ్వ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఎల్లారెడ్డి: సైబర్ నేరాలపై షీటీం బృందం సభ్యులు విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో షీటీం సభ్యులు సైబర్ నేరాల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు శ్రీనివాస్, సుప్రజ, ప్రిన్సిపాల్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో..

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ మోసాలు, పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్, ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంట్ సోలంకి రవళి, సంస్థ వలంటీర్ ప్రత్యూష, అధ్యాపకులు పాల్గొన్నారు.

మూగబోయిన బీఎస్ఎన్ఎల్ సెల్‌ఫోన్లు

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్‌ఫోన్లు సిగ్నల్స్ లేక శనివారం మూగబోయాయి. ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు బీఎస్ఎన్ఎల్ ఫోన్లు పనిచేయకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గతంలో మండల కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఉండేది. ఏదైనా సమస్య వస్తే వినియోగదారులు కార్యాలయంలో సంప్రదించేవారు. కానీ కొన్ని నెలల క్రితం ఈ కార్యాలయాన్ని తొలగించారు. దీంతో వినియోగదారులు సెల్‌ఫోన్‌లకు సంబంధించిన సమస్యలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థం కాక ఇబ్బందులు పడ్డారు.